సాక్షి
విశాఖపట్నం

శుక్రవారం। 3। జనవరి। 2025



పారాచూట్ సాయంతో దిగుతున్న కమాండో

డార్నియర్ విమానాల శ్రేణి



పేలిన ఆయిల్ రిగ్



అలల జోరు.. విన్యాసాల హోరు

- అబ్బురపరిచిన నౌకాదళ విన్యాసాలు
- రేపటి తుది విన్యాసాలకు ఏర్పాట్లు







ఏయూక్యాంపస్: కడలిపై కదన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా సాగరతీరంలో గురువారం జరిగిన నావికాదళ పూర్తిస్థాయి విన్యాసాలతో నగరవాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. దాదాపు గంటన్నరపాటు కనులార్పకుండా ప్రజలు వీటిని వీక్షించారు. భారత నావికాదళం తమ సాయుధ సంపత్తిని ప్రజలకు తెలిపే విధంగా ఈ విన్యాసాలు సాగాయి. 15 యుద్ధ విమానాలు, జలాంతర్గామి, పలు నౌకలు పాల్గొన్నాయి. తొలుత మూడు హెలికాప్టర్లు భారత జాతీయ పతాకాన్ని, నావికాదళ పతాకాన్ని గగనతలంలో ఎగురవేస్తూ.. ప్రయాణించడంతో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. వెంటనే ఐదు హాక్ విమానాలు గగనతలంలో గర్జిస్తూ కనువిందు చేశాయి. మెరైన్ కమాండోలు హెలికాప్టర్ నుంచి ఎంతో చాకచక్యంగా సముద్రంలోకి దిగి, అక్కడి నుంచి జెమిని బోట్లలో తీరానికి చేరుకుని బందీలను విడిపించారు. తిరిగి సముద్రంలోకి వెళ్లిపోవడం ఎంతో ఆసక్తిని కలిగించాయి. ఆయిల్ రిగ్‌ను విజయవంతంగా పేల్చి సముద్రంలో జరిగే యుద్ధాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. భారత్‌లో తయారైన ఎల్‌సీఎం హెలికాప్టర్ నుంచి పారాచూట్‌ల సహాయంతో మెరైన్ కమాండోలు ఎంతో చాకచక్యంగా కిందకు దిగిన విధానం ఆకట్టుకుంది. ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ నౌకలపై చేతక్ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు దిగిన తీరు అబ్బురపరిచింది. అనంతరం రెండు హాక్ విమానాలు రెండు వైపులా వాయువేగంతో దూసుకువెళ్లడం, ఏంజెల్స్‌గా పిలిచే చేతక్ హెలికాప్టర్లు ఎంతో సమన్వయంతో చేసిన విన్యాసాలు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్‌లో అత్యవసర, విపత్తు సమయాల్లో ప్రజలను రక్షించే విధానం చూపిన తీరు అదరహో అనిపించింది. అనంతరం సీ క్యాడెట్ కార్ప్స్ నృత్యం, నౌకల నుంచి నమూనా ఫైరింగ్, బాణం ఆకారంలో వెళ్లిన ఏఎల్‌హెచ్ విమానాలు, డార్నియర్ విమానాల శ్రేణి, పీహెచ్ఐ విమానం, జెట్ ఫైటర్‌ల విన్యాసాలు అందరిలో ఉత్సుకతను పెంచాయి. చివరిగా నావికాదళం బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం జరిగింది. విద్యుత్‌కాంతులతో నౌకలు మెరిసిపోయాయి. నావికాదళ సైనికులు చేసిన కవాతు ప్రజల మనసుల్లో నిలిచిపోయింది. ఈ విన్యాసాలను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వీక్షించారు. నావికాదళ తుది దశ విన్యాసాలు ఈ నెల 4వ తేదీన జరగనున్నాయి.





విన్యాసాలు తిలకిస్తున్న నేవీ సిబ్బంది కుటుంబ సభ్యులు





ఆకట్టుకున్న లేజర్ షో

విన్యాసాల్లో భాగంగా చివరగా లేజర్ షోను ప్రదర్శించారు. భారతీయ నావికాదళం ప్రతిభను చాటే విధంగా లేజర్, డ్రోన్ షోలు జరిగాయి. చిన్నారులు, యువత ఈ షోలను వీక్షించి ఉత్తేజితులయ్యారు. బాణసంచా వెలుగులు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.





బాణసంచా వెలుగులు



విద్యుత్ వెలుగుల్లో నౌకలు





షో అదిరింది

- అడ్డంకులు దాటి.. అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతి యర్రాజీ
- పాఠశాల స్థాయి నుంచి ఒలింపిక్స్ స్థాయికి ఎదిగిన పరుగుల రాణి
- జిల్లా అథ్లెటిక్ సంఘం, జిల్లా ఒలింపిక్ సంఘం హర్షం





విశాఖ జ్యోతి.. జాతీయ కీర్తి

ఆమె పరుగు చిరుత వేగాన్ని తలపిస్తుంది. ట్రాక్‌లో దిగిందంటే ట్రెండ్ సెట్ చేయాల్సిందే. ఇది ఆమె ట్రాక్ రికార్డు చూస్తేనే తెలుస్తుంది. ఎటువంటి క్రీడా నేపథ్యం లేని కుటుంబం నుంచి వచ్చి.. ఓ వైపు గాయాలు వెంటాడినా.. కరోనా సమయంలో పరుగుకు దూరమైనా నిరాశ చెందలేదు. పరుగును ఆపలేదు. అవరోధాల(హర్డిల్స్)ను అధిగమిస్తూ రికార్డుల మీద రికార్డులు సృష్టించింది. దేశంలోనే అత్యంత వేగవంతమైన మహిళా హర్డిలర్‌గా చరిత్ర లిఖించింది. ఒలింపిక్స్ క్రీడాకారులందరికీ ఒక కల. ఆ కలను నిజం చేస్తూ దేశంలోనే తొలి మహిళా హర్డిలర్‌గా ఖ్యాతినార్జించింది. రెప్పపాటులో పతకం చేజారిపోయే అథ్లెటిక్స్‌లో అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం ఒక ఎత్తు అయితే.. క్రీడాకారులకు అందించే అత్యున్నత అవార్డు 'అర్జున'పొందడం గొప్ప విషయం. అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ ఈ నెల 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అర్జున అవార్డు అందుకోనుంది మన విశాఖ అమ్మాయి, అథ్లెట్ జ్యోతి యర్రాజీ.

- విశాఖ స్పోర్ట్స్

ఆర్థికంగా స్థిరమైన స్థితిలో లేకపోయినా.. జ్యోతి చిన్నప్పటి నుంచే ఆటల పట్ల ఆసక్తి పెంచుకుంది. జాతీయ స్థాయిలో రాణించాలని కలలుకంది. ఆమె తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా, తల్లి ఇళ్లలో సహాయక పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. జ్యోతి పోర్టు ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమయంలో ఆటల పట్ల ఆసక్తి కనబరిచింది. పాఠశాలలో ప్రత్యేక శిక్షణ శిబిరాలు ప్రారంభించడంతో స్కూల్ గేమ్స్‌లోనే పతకం సాధించింది. తొలుత స్ప్రింట్‌లోని మూడు విభాగాల్లో పాల్గొనేది. ఆ తర్వాత రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శిక్షణ శిబిరంలో పాల్గొనడంతో జాతీయ స్థాయిలో పోటీపడింది. 2019లో గుంటూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చేరింది. అప్పటి వరకు జాతీయ స్థాయిలో పోటీ పడుతున్నా ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ సమయంలో రిలయన్స్ పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో అథ్లెటిక్స్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని తెలియడంతో దరఖాస్తు చేసుకుంది. అప్పటికే జాతీయ స్థాయిలో పతకం ఉండటంతో శిబిరంలో స్థానం సంపాదించింది. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ.. జాతీయ రికార్డులు నెలకొల్పడం, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించడంతో జాతీయ మహిళా ఫాస్టెస్ట్ హర్డిలర్‌గా నిలిచింది. ఒకే ఏడాదిలో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ ప్రపంచ ర్యాంకింగ్‌లో 24వ స్థానానికి చేరుకుని.. ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. తొలిసారి ప్రపంచ మేటి వుమెన్ హర్డిలర్స్ పోటీని ఆస్వాదించింది. ప్రస్తుతం ముంబయిలో శిక్షణ శిబిరంలో ఉన్నానని, అర్జున అవార్డుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని జ్యోతి 'సాక్షి'తో చెప్పింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం, ఒలింపిక్స్‌లో పాల్గొనడం జ్యోతికి కీర్తిని తెచ్చిపెట్టిందని జిల్లా అథ్లెటిక్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. భారత ప్రభుత్వం నుంచి అర్జున అవార్డు పొందడం గర్వించదగ్గ విషయమని జిల్లా ఒలింపిక్ సంఘం మరో ప్రకటనలో అభినందనలు తెలిపింది.

ఆనందానికి అవధుల్లేవు

ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా.. ఆటల్లో పాల్గొనేందుకు జ్యోతిని ప్రోత్సహించాం. శాప్‌లో ప్రత్యేక శిక్షణకు అర్హత సాధించినప్పుడే తొలిసారిగా విశాఖను విడిచి వెళ్లింది. అప్పటి నుంచి ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకుంది. అర్జున అవార్డు వచ్చిందని జ్యోతి చెబుతుంటే మా ఆనందానికి అవధులు లేవు. ఇంటికి సైతం రాకుండా అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది.

– సూర్యనారాయణ, జ్యోతి తండ్రి

రికార్డులను తిరగరాసింది

అథ్లెటిక్స్‌లో అర్జున అవార్డు పొందడం పూర్తిగా వ్యక్తిగత ప్రతిభతోనే సాధ్యమవుతుంది. అథ్లెటిక్స్‌లో టైమింగ్ చాలా కీలకం. క్షణంలో ఫలితం తారుమారవుతుంది. అలాంటి ట్రాక్ ఈవెంట్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించాలంటే ఎంతో కఠోర శ్రమ ఉండాలి. రికార్డును నిలబెట్టుకోవడం సులభం కాదు. అలాంటి రికార్డును జ్యోతి తిరగరాసింది.

– ఐ.వెంకటేశ్వరరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత



తల్లితో అథ్లెట్ జ్యోతి

అంచెలంచెలుగా ఎదిగింది

క్రీడాకారులకు అత్యున్నత పురస్కారం అర్జున అవార్డు. అలాంటి అవార్డును అందుకోవాలంటే నిరంతర సాధన, పట్టుదల, శారీరక దృఢత్వం ఎంతో అవసరం. జ్యోతి అంచెలంచెలుగా ఎదుగుతూ.. పతకాలు సాధిస్తూ.. విశాఖపట్నం నుంచి ఒలింపిక్స్ స్థాయికి ఎదిగింది. భవిష్యత్‌లో ఆమె ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని ఆకాంక్షిస్తున్నా..

– ఉష, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత

మరిన్ని విజయాలు సాధించాలి

పాఠశాల, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలుకొని ప్రతి రోజూ పోర్ట్ స్టేడియంలో కలిసి శిక్షణకు వెళ్లేవాళ్లం. సాయంత్రం వేళల్లో వ్యాయామాలు చేసేవాళ్లం. ప్రతీ వారం జ్యోతితో పోటీపడేవాళ్లం. జ్యోతి శాప్ శిక్షణకు ఎంపికైంది. అలా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తూ నేడు అర్జున అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఆమె మరిన్ని విజయాలు సాధించాలి.

– పూజిత, పాఠశాలలో తోటి క్రీడాకారిణి

శ్రమించింది.. సాధించింది..

తొలినాళ్లలో అవరోధాలు ఎదురైనా ఆమె నిలదొక్కుకుంది. జాతీయ రికార్డు నెలకొల్పే క్రమంలో గాలి వేగం కారణంగా రికార్డు నమోదు కాకపోవడం జ్యోతిని కాస్త నిరాశకు గురి చేసింది. అయినప్పటికీ తన రికార్డును తానే అధిగమించి జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకుంది. అర్జున అవార్డు అందుకోవడం మనందరికీ గర్వకారణం.

– రాంకుమార్, సంయుక్త కార్యదర్శి, జిల్లా అథ్లెటిక్ సంఘం

రేపు సీఎం చంద్రబాబు రాక

మహారాణిపేట : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 4వ తేదీన విశాఖ వస్తున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి మధ్యాహ్నం 3.40 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 3.45 నుంచి 4.15 గంటల వరకు విమానాశ్రయంలో సీఎం టూర్ రిజర్వ్‌లో ఉంచారు. 4.15 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి బయలు దేరి ఆర్కే బీచ్‌కు చేరుకుంటారు. 4.40 గంటల నుంచి 6.10 గంటల వరకు బీచ్‌లో జరిగే నేవీ విన్యాసాల్లో పాల్గొంటారు. అక్కడ నుంచి విమానాశ్రయానికి చేరుకొని.. సాయంత్రం 6.50 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు బయలు దేరుతారు.

నేడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాక

మహారాణిపేట: జిల్లా ఇన్‌చార్జి మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి శుక్రవారం ఉదయం 8.35 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ నుంచి నేరుగా ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుంటారు. అనంతరం ఉత్తరాంధ్ర జిల్లాల సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్లు, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లతో సమీక్ష సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో అధికారులు, కూటమి నాయకులతో ఈనెల 8న విశాఖ ప్రధాని నరేంద్ర మోదీ పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహిస్తారు.

నేడు పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదుల స్వీకరణ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో పట్టణ ప్రణాళిక విభాగంపై ఫిర్యాదులు స్వీకరించనున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించనున్న కార్యక్రమంలో అధికారులు ఫిర్యాదులు స్వీకరించనున్నారని చెప్పారు.

జోన్‌కు మరో సారీ!



దశాబ్దాల కలగా మిగిలిన దక్షిణ కోస్తా రైల్వే జోన్ అంశంలో కూటమి ప్రభుత్వం మరోసారి రిక్తహస్తాలు చూపిస్తోంది. ఈ నెల 8న విశాఖలో ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో జోన్ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. రాయగడ డివిజన్‌కు పీఎం చేతుల మీదుగా శంకుస్థాపనకు చకచకా ఏర్పాట్లు చేస్తున్న అధికారులు.. దక్షిణ కోస్తా రైల్వే జోన్ శంకుస్థాపన మాత్రం ఉండబోదని స్పష్టం చేస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని వాయిదా వేయాలని కూటమి నేతలు పట్టుబట్టడంతోనే 'జోన్'కు గ్రహణం పట్టినట్లు తెలుస్తోంది.

- 8వ తేదీన ప్రధాని మోదీ విశాఖ రాక
- 6వ తేదీన రాయగడ డివిజన్‌కు శంకుస్థాపన
- దక్షిణ కోస్తా రైల్వే జోన్ శంకుస్థాపన లేదని చెబుతున్న అధికారులు
- ఇప్పటికే పలుమార్లు వాయిదా వేసిన ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది చివరిలో ఇచ్చారు. కానీ ఇంతవరకు కార్యరూపం దాల్చకుండా కేవలం రాజకీయ కక్షతోనే జోన్‌ను ఆపేశారు. 2022లో జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్‌ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. అక్కడ ఉన్న 13 ఎకరాల్లోని 8 ఎకరాల విస్తీర్ణంలో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారని శిలాఫలకం కూడా సిద్ధం చేసి చివరి నిమిషంలో రాజకీయ కుట్రతో నిలిపేశారు.

వాయిదాల పర్వమే..

గత నవంబర్ 29న విశాఖలో ప్రధాని పర్యటనకు సర్వం సిద్ధమైంది. పలు ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ప్రధాని చేతుల మీదుగా చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయగా.. అందులో సౌత్ కోస్ట్ రైల్వే జోన్ శంకుస్థాపన కార్యక్రమం కూడా ఉంది. అయితే.. కూటమి నేతలు జోన్ శంకుస్థాపనను వాయిదా వేయాలని పట్టుబట్టడంతో చివరి నిమిషంలో ఆపేశారు. ఆ తర్వాత ప్రధాని పర్యటన కూడా వాయిదా పడింది. ఈ నెల 8న విశాఖ జిల్లాలో ప్రధాని పర్యటించనున్నట్లు అధికారులు ధృవీకరించారు. ఆంధ్ర యూనివర్సిటీలో ఏర్పాటు చేయనున్న కార్యక్రమంలో ప్రధాని పాల్గొని కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. దీనికి సంబంధించి రైల్వే బోర్డు.. వివిధ రైల్వే డివిజన్ల నుంచి ప్రాజెక్టుల వివరాలు పంపించాలని ఆదేశాలు జారీ చేసింది. వాల్తేరు డివిజన్‌కు మాత్రం ఎలాంటి ఆదేశాలు అందలేదు. అయితే ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ మాత్రం రాయగడ డివిజన్ శంకుస్థాపన గురించి ప్రతిపాదనలు పంపించి, విశాఖ జోన్ గురించి అందులో పొందుపరచలేదు. దీంతో ఈసారి కూడా ప్రధాని పర్యటనలో రైల్వే జోన్ శంకుస్థాపన ఉండబోదని రైల్వే అధికారులు స్పష్టం చేస్తున్నారు.

జోన్‌తో పాటు రాయగడ డివిజన్ కానీ..

దక్షిణ కోస్తా రైల్వే జోన్‌తోపాటే వాల్తేరు డివిజన్‌లో కొంత భాగం, ఈస్ట్‌కోస్ట్‌లోని మరికొంత భాగం కలిపి రాయగడ డివిజన్‌ని ప్రకటించారు. రైల్వే జోన్ కోసం ఇప్పటివరకు రూ.106 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం ప్రకటించగా.. రాయగడ డివిజన్‌కు మాత్రం రూ.70 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటికే స్టేషన్ పక్కనే రాయగడ డివిజన్ కార్యాలయ నిర్మాణానికి టెండర్లు ఖరారు చేసినట్లు సమాచారం. ఇప్పుడు విశాఖలో ఈ డివిజన్ శంకుస్థాపన నిర్వహించి.. జోన్‌ని పక్కన పెడితే వ్యతిరేకత వస్తుందనే కారణంతో.. 6వ తేదీన వర్చువల్‌గా పీఎం చేతుల మీదుగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే జోన్ కోసం మరికొద్ది నెలలు ఆగాల్సిందేనని రైల్వే అధికారులు చెబుతున్నారు.

తాత్కాలిక సేవలు కూడా లేనట్లే.!

జోన్ ప్రకటన వచ్చి ఐదేళ్లు గడిచిన తర్వాత.. తాజాగా టెండర్లను ఆహ్వానించారు. అయితే.. కొత్త భవన నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించేందుకు రెండేళ్లకు పైగా సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోగా జోన్ కార్యకలాపాలు కూడా ప్రారంభించాలనే ఆదేశాలు ఇవ్వాలా వద్దా అనే ఆలోచనలో రైల్వే బోర్డు ఉంది. ఒకవేళ బిల్డింగ్ నిర్మాణంతో పనిలేకుండా.. జోన్ కార్యకలాపాలు ప్రారంభించాలని కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే.. తాత్కాలిక కార్యాలయంగా ప్రస్తుతం ఉన్న వాల్తేరు డీఆర్‌ఎం కార్యాలయాన్ని వినియోగిస్తారని అనుకున్నారు. కానీ.. కొత్త కార్యాలయం పూర్తయితేనే.. జోన్ కార్యకలాపాలు నిర్వహిస్తామని రైల్వే ఉన్నతాధికారులు సంకేతాలిచ్చినట్లు వాల్తేరు వర్గాలు చెబుతున్నాయి. అయితే జోన్‌ని కూటమి నేతలు ఎన్నికల అంశంగా చూస్తున్నారే తప్ప.. సెంటిమెంట్‌గా చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



జోన్ భవన నిర్మాణ పనులు జరగాల్సింది ఇక్కడే

మెరిసిన మీనూ



సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం నగరంలో సందడి చేశారు. జగదాంబ జంక్షన్‌లో ఆర్ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని మీనాక్షి తెలిపారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం: భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో జగదల్‌పూర్ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- ఈ నెల 6న విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ జగదల్‌పూర్ నుంచి బయల్దేరుతుంది.
- ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది, తిరుగు ప్రయాణంలో ఈ నెల 6వ తేదీన కిరండూల్- విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి బయల్దేరుతుంది.

నేడు జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశం

డాబాగార్డెన్స్: జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశంలో శుక్రవారం నిర్వహించనున్నారు. మేయర్, స్థాయీ సంఘ చైర్‌పర్సన్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన ఉదయం 11 గంటల నుంచి జీవీఎంసీ స్థాయీ సంఘ సమావేశ మందిరంలో నిర్వహించనున్న సమావేశంలో 42 అజెండా అంశాలు సభ్యుల దృష్టికి చర్చకు రానున్నాయి.



ప్రహ్లాదపురం, సింహాచలం రోడ్డులో..

మంచు కురిసే.. మనసు దోచే!

మంచు తెరల చాటున మహా నగరం దుప్పటి కప్పుకొని మురిసి పోతోంది. పొద్దుపోయే సరికి చలి పులిలా వెన్నులో వణుకు పుట్టిస్తుంటే.. తెల్లవారుజామున కురుస్తున్న మంచు అందాలు కనువిందు చేస్తున్నాయి. కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ రాత్రి నుంచి ఉదయం వరకూ విపరీతంగా మంచు కురుస్తోంది. రహదారులను మంచుతెరలు కమ్మేస్తున్నాయి. వాహనచోదకులు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. బారెడు పొద్దెక్కినా భానుడు ఇంకా పొగమంచు దుప్పటి చాటునే దాక్కుంటూ.. ఉదయం 7 తర్వాతే బయటకు వచ్చి హలో చెబుతున్నాడు. నగరాన్ని ఒకింత చలి వణికిస్తున్నా హిమసోయగం కట్టిపడేస్తూ.. కొత్త అందాల్ని అందిస్తోంది..!

-ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



గోపాలపట్నంలో కమ్మేసిన పొగమంచు



హనుమంతువాక-అడవివరం బీఆర్‌టీఎస్ రోడ్డులో..





వేపగుంట నుంచి పెందుర్తి వరకు పరుచుకున్న మంచుదుప్పటి

త్వరలో సదరం సర్టిఫికెట్ల తనిఖీలు

మహారాణిపేట: జిల్లాలో సదరం సర్టిఫికెట్ల తనిఖీకి షెడ్యూలు రూపొందిస్తున్నారు. గురువారం వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, సెర్ప్ సీఈవో వీరపాండ్యన్ అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సర్వే కోసం సన్నాహాలు చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ జిల్లాలో సమావేశం నిర్వహించి ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మొదటి దశలో దీర్ఘకాలిక వ్యాధులతో మంచం పట్టి పింఛన్ పొందుతున్న వారి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో నూరు శాతం పర్సంటేజీతో 315 మంది రూ.15 వేలు పింఛను పొందుతున్నారు. అనేక మంది 80 శాతం పర్సంటేజీతో రూ.15 వేలు పొందుతున్నట్లు ఆరోపణల నేపథ్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా పింఛన్లు పొందే వారిని తొలగించే ప్రక్రియను ప్రభుత్వం చేపట్టిందని ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగా సదరం సర్టిఫికెట్ల పరిశీలన చేపడుతున్నారు.

వైద్య బృందాల నియామకం

ఆర్థోపెడిక్, ఫిజిషియన్, ఇతర స్పెషలిస్టులతో బృందాలను నియమిస్తున్నారు. ఈ బృందాల నియామకం కోసం డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వర రావు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి(డీసీహెచ్) డాక్టర్ శంకర్ ప్రసాద్‌లకు బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

రోజుకు 20 మంది ఇళ్లకు..

వారానికి మూడు రోజుల పాటు తనిఖీలు చేయడం, రోజుకు 20 మంది ఇళ్లకు వెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. సచివాలయం డిజిటల్ అసిస్టెంట్‌తోపాటు స్థానికంగా ఉన్న ఏఎన్‌ఎంను కూడా వెళ్లడానికి ప్రణాళిక తయారు చేస్తున్నారు. వైద్య బృందాల పరిశీలన కోసం సూక్ష్మ ప్రణాళిక, రూట్ మ్యాప్ సిద్ధం చేస్తున్నారు. విశాఖలో పనిచేస్తున్న వైద్యులు అనకాపల్లిలోను, అనకాపల్లిలో పనిచేస్తున్న వైద్యులు విశాఖలో నూరు శాతం పర్సంటేజ్‌తో జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను నిశితంగా పరిశీలిస్తారు. పరిశీలన కోసం ప్రభుత్వం రూపొందించిన ప్రత్యేక యాప్‌లో వివరాలను నిక్షిప్తం చేస్తున్నారు. నకిలీ ధ్రువీకరణ పత్రాలు, ట్యాంపరింగ్ వంటి వాటిపై ఉమ్మడి జిల్లా స్థాయిలో సమగ్ర నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ గేమ్స్‌కు బానిసై యువకుడి ఆత్మహత్య


మల్కాపురం: ఆన్‌లైన్ గేమ్స్, మద్యానికి బానిసైన ఓ వ్యక్తి తన గదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, జాలరివీధి ప్రాంతంలో నాగుల అప్పలరాజు(30) భార్య నాగుల పద్మతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతను హెచ్‌పీసీఎల్‌లో కాంట్రాక్ట్ కార్మికుడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆడుతూ.. దొరికిన చోట అప్పులు చేశాడు. దీనికి తోడు మద్యం అలవాటైంది. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో తన గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. అతను గది నుంచి ఎంతసేపటికి రాకపోవడంతో అనుమానం వచ్చి అతని భార్య కిటికీ నుంచి చూసింది. గదిలో హుక్కుకు వేలాడుతున్న భర్తను చూసి కేకలు వేసింది. దీంతో ఇరుగుపొరుగు వారు వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆన్‌లైన్ గేమ్స్‌లో డబ్బులు పోగొట్టుకోవడం, ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తడం, దీనికి తోడు మద్యం అలవాటుతో అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు చెబుతున్నారు. పోస్టుమార్టం కోసం అప్పలరాజు మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.

వృత్తి కార్మికులకు నైపుణ్య శిక్షణ

డాబాగార్డెన్స్: నగరంలో గల వృత్తి కార్మికులు నైపుణ్యాభివృద్ధి శిక్షణ పొందేందుకు ఈ నెల 5వ తేదీ లోగా పేర్లు నమోదు చేసుకోవాలని యూసీడీ పీడీ పి.ఎం.సత్యవేణి పేర్కొన్నారు. మెప్మా ఆధ్వర్యంలో జీవీఎంసీ పరిధిలో గల స్వయం సహాయక సంఘాల సభ్యుల కుటుంబాల్లోని కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, ఏసీ, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, వాటర్ ప్యూరిఫైయర్, గ్రీజర్ టెక్నీషియన్, బ్యూటీషియన్(మెన్ అండ్ వుమెన్) వంటి సేవలు అందిస్తున్న వారిని గుర్తించి అవసరమైన నైపుణ్య శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో ఆసక్తి గల సర్వీస్ ప్రొవైడర్లను హోం ట్రయాంగిల్ యాప్ ద్వారా నమోదు చేసి.. వారికి అవసరమైన శిక్షణ ఇవ్వడానికి, బిగ్ ఎకానమీలో భాగమైన ఆర్థికాభివృద్ధి సాధించేందుకు సర్వీస్ ప్రొవైడర్ల గుర్తింపు మేళా నిర్వహించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సంబంధిత ఎస్‌హెచ్‌జీ ఆర్పీల ద్వారా లేదా జోనల్ కార్యాలయాల్లో గల యూసీడీ విభాగంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.



15 రోజుల కిందట కాలుష్య కోరల్లో చిక్కుకుని.. నల్లగా మారిన జాతీయ జెండా



రెండు రోజుల కిందట కిందకు జారిపోయిన జెండా



గురువారం నాటికి జెండా పరిస్థితి ఇది

కాలుష్య కోరల్లో 'త్రివర్ణం'

రైల్వే నిర్లక్ష్యానికి నిదర్శనం

జాతీయ పతాకంలోని కాషాయం దేశం పట్ల ప్రజల త్యాగాన్ని, ఆత్మస్థైర్యాన్ని ప్రతిబింబిస్తే, తెలుపు స్వచ్ఛతను, శాంతిని, నిజాయితీని చాటుతోంది. ఆకుపచ్చ విశ్వసనీయతను, ప్రకృతిని, పాడిపంటలను, సంపదను సూచిస్తుంది. మానవ ధర్మాన్ని ప్రబోధించే అశోకుడి ధర్మ చక్రం నీలిరంగు నిజాయితీకి ప్రతీకగా నిలుస్తుంది. ఆ రంగుల్లో ఒక అందం, ఆకర్షణ, అంతకుమించి ఒక జాతి అస్తిత్వం, ఐకమత్యం, ధర్మం దాగి ఉన్నాయి. ఇంకా చెప్పాలంటే భారత జాతి ఆశలను, ఆశయాలను ప్రతిబింబించే ప్రకాశవంతమైన వర్ణాలివి. అలాంటిది త్రివర్ణాలు వెలిసిపోతున్నాయి. జాతీయ జెండా మసకబారి నల్లగా మారుతోంది. ఎక్కడ అంటారా? విశాఖపట్నం రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని ఈ జెండాను రైల్వే అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. ఆకాశమంత ఎత్తున ఎగురవేశారు. అంతవరకు బాగానే ఉంది. అయితే మువ్వన్నెల జెండా కాలుష్య కోరల్లో చిక్కుకుని రోజురోజుకూ నల్లగా మారుతోంది. నిన్న, మొన్నటి వరకు ఆకాశమంత ఎత్తులో ఎగిరిన జెండా క్రమంగా కిందకు జారిపోతోంది. గురువారం నాటి పరిస్థితి చూస్తే.. జాతీయ జెండా మొత్తం కిందకి వచ్చేసింది. ఈ జెండాను సరిచేయాలన్న కనీసం ధ్యాస రైల్వే అధికారులకు లేకపోవడం విచారకరం. ఇదీ మన జాతీయ జెండాకు రైల్వే విభాగం గౌరవిస్తున్న తీరు!

-డాబాగార్డెన్స్

ట్రాఫిక్ ఆంక్షలివే..

నేవీ విన్యాసాలకు వచ్చే వాహనచోదకులకు పోలీసుల సూచనలు

విశాఖ సిటీ: భారత నౌకాదళ ప్రదర్శనకు బీచ్‌రోడ్డు ముస్తాబవుతోంది. శనివారం జరిగే నౌకాదళ యుద్ధ విన్యాసాలను వీక్షించేందుకు వేల సంఖ్యలో నగరవాసులు వచ్చే అవకాశం ఉండటంతో.. అధికారులు అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రదర్శనను తిలకించేందుకు వచ్చే వాహనచోదకులకు నగర పోలీసులు పలు సూచనలు చేశారు. శనివారం మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 8 గంటల వరకు వాహనచోదకులతో పాటు పాసులు కలిగిన వారు కూడా ఈ సూచనలు పాటించాలన్నారు.

వాహనాలకు అనుమతి లేదు

కలెక్టరేట్ జంక్షన్ నుంచి నేవల్ కోస్టల్ బ్యాటరీ వరకు, నేవల్ క్యాంటీన్ జంక్షన్ నుంచి కోస్టల్ బ్యాటరీ, పంది మెట్ట జంక్షన్ నుంచి నోవాటెల్ హోటల్, సెంచరీ క్లబ్ నుంచి నోవాటెల్ హోటల్, సిరిపురం జంక్షన్ నుంచి బీచ్ రోడ్ ఎన్టీఆర్ విగ్రహం, ఆల్ ఇండియా రేడియో జంక్షన్ నుంచి పాండురంగాపురం జంక్షన్ వరకు పాసులు లేని వాహనాలను అనుమతించరు.

పార్కింగ్ ప్రాంతాలివే..

- సిరిపురం నుంచి బీచ్‌వైపు వచ్చే సాధారణ వాహనచోదకులు ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో లేదా ఏయూ ఫుట్‌బాల్ మైదానంలో వాహనాలు నిలపాలి. అక్కడి నుంచి కాలి నడకన పార్క్ హోటల్ జంక్షన్‌కు చేరుకోవాలి. అక్కడ నుంచి బీచ్ రోడ్‌లోకి రాకుండా.. బీచ్‌లో ఉన్న ఎన్‌క్లోజర్లలోకి కాలినడకన వెళ్లాలి. పార్క్ హోటల్ నుంచి ఎటువంటి వాహనాలను బీచ్ రోడ్డులోకి అనుమతించరు.
- జోడుగుళ్లపాలెం, ఎంవీపీ కాలనీ, కురుపాం టవర్స్ మీదుగా వచ్చే సాధారణ వాహనచోదకులు వారి వాహనాలను ఎంజీఎం గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. కాలినడకన పార్క్ హోటల్ జంక్షన్‌కు చేరుకొని బీచ్‌లో ఉన్న ఎన్‌క్లోజర్స్‌లోకి వెళ్లాలి.
- పాసులు ఉన్న వాహనచోదకులు ఏపీఐఐసీ గ్రౌండ్‌లో గానీ, ఏయూ ఇంగ్లిష్ మీడియం మైదానం వద్ద పార్క్ చేసుకుని.. బీచ్ రోడ్‌లో కేటాయించిన ఎన్‌క్లోజర్లలోకి ప్రవేశించాలి.
- జగదాంబ జంక్షన్ నుంచి, సెవెన్ హిల్స్ హాస్పిటల్ నుంచి, కేజీహెచ్ వైపు నుంచి వచ్చే వాహనచోదకులు కలెక్టర్ ఆఫీస్ దగ్గరలోని ఆంధ్రా మెడికల్ కాలేజ్ గ్రౌండ్‌లో లేదా జిల్లా పరిషత్ వద్ద ఖాళీ ప్రదేశంలో గానీ, జూబ్లీ హోం గ్రౌండ్‌లో గాని నిలపాలి. అక్కడి నుంచి కాలినడకన నేవల్ కోస్టల్ బ్యాటరీ జంక్షన్‌కు చేరుకుని.. అక్కడ బీచ్‌లో ఉన్న ఎన్‌క్లోజర్లలోకి వెళ్లాలి.
- భీమిలి వైపు నుంచి బీచ్ రోడ్‌లో పార్క్ హోటల్ వైపు వచ్చే సిటీ బస్సులు కామత్ హోటల్ నుంచి కుడి వైపుగా వెళ్లాలి. అక్కడి నుంచి ఉషోదయ జంక్షన్, ఏఎస్ రాజా కాలేజీ, ఎంవీపీ డబుల్ రోడ్డు మీదుగా ద్వారకా బస్‌స్టేషన్‌కు చేరుకోవాలి.

అప్పన్న ఉద్యోగి సస్పెన్షన్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో శానిటేషన్ విభాగంలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగి కె.అప్పలరాజును ఈవో వి.త్రినాథరావు గురువారం సస్పెండ్ చేశారు. గత నెల 28న శనివారం స్వామి దర్శనానికి వచ్చిన దిలీప్‌కుమార్, అతని కుటుంబ సభ్యులు ఐదుగురికి దర్శనం కల్పిస్తానని చెప్పి అప్పలరాజు వారి నుంచి రూ.1,800 తీసుకున్నాడు. దీనిపై పీఆర్వో కార్యాలయంలో దిలీప్‌కుమార్ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవస్థానం ఈవో త్రినాథరావు విచారణ చేపట్టి అప్పలరాజుపై వేటు వేశారు.

వీఎంఆర్‌డీఏలో ప్రతి శుక్రవారం ఓపెన్ ఫోరం

విశాఖ సిటీ: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం వీఎంఆర్‌డీఏలో ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటలకు టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు అధికారులు ప్రకటించారు. టౌన్ ప్లానింగ్ సేవలను వేగవంతం చేసేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. దీని ద్వారా చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న భవన నిర్మాణ అనుమతుల దరఖాస్తులు, ఇతరత్రా అభ్యర్థులను స్వీకరిస్తామని వెల్లడించారు. వీటిని పరిశీలించి ప్రాధాన్యత ప్రాతిపదికను పరిష్కరిస్తామని చెప్పారు. ప్రతి శుక్రవారం వీఎంఆర్‌డీఏ మూడో ఫ్లోర్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వీఎంఆర్‌డీఏ కమిషనర్ ఆధ్వర్యంలో చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పోలీస్ దుకాణానికి బహిరంగ వేలం

విశాఖ సిటీ: విశాఖ పోలీస్ శాఖకు చెందిన ఒక షాపును బహిరంగ వేలం ద్వారా లీజుకు ఇవ్వనున్నట్లు ఏడీసీపీ(అడ్మిన్) రాజ్‌కమల్ ఒక ప్రకటనలో తెలిపారు. కేజీహెచ్ డౌన్‌లో ఉన్న రక్షా ప్లాజా షాపింగ్ కాంప్లెక్స్‌లో షాప్ నెంబర్ 29ను ఈ వేలం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఈ నెల 6వ తేదీన ఉదయం 11 గంటలకు పోలీస్ బ్యారెక్స్‌లో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగే ఓపెన్ ఆక్షన్‌లో పాల్గొనాలని సూచించారు.

దివ్యాంగ సురక్షకు మూడు ఫిర్యాదులు

విశాఖ సిటీ: దివ్యాంగ్ సురక్ష టోల్ ఫ్రీ నంబర్‌కు మూడు ఫిర్యాదులు వచ్చాయి. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి గురువారం ఈ కార్యక్రమం నిర్వహించారు. సైన్ లాంగ్వేజ్ తెలిసిన నిపుణురాలి ద్వారా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఈ ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని సంబంధిత పోలీస్‌స్టేషన్లలో దర్యాప్తు చేసి న్యాయం చేస్తామని ఫిర్యాదుదారులకు సీపీ హామీ ఇచ్చారు.

నేటి నుంచి మహిళా కానిస్టేబుల్ అభ్యర్థులకు పరీక్షలు



పరుగు పోటీలో పాల్గొన్న పురుష అభ్యర్థులు

ఆరిలోవ: కానిస్టేబుల్ నియామక పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. కైలాసగిరిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. గురువారం 600 మంది అభ్యర్థులకు గాను 228 మంది హాజరయ్యారు. అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా పర్యవేక్షణలో అధికారులు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, బ్యాగేజ్ కౌంటర్, ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్ (పీఎంటీ), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ) నిర్వహించారు. తర్వాత 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్ పోటీలు జరిగాయి. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు మహిళా అభ్యర్థులకు శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్ ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేపడుతున్నమీనాక్షి చౌదరి

అల్లిపురం: జగదాంబ సెంటర్‌లో అతిపెద్ద వస్త్ర ప్రపంచం ఆర్‌ఎస్ బ్రదర్స్ షోరూమ్‌ను సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్‌ఎస్ బ్రదర్స్ నమ్మకమైన బ్రాండ్ అని, విశాఖ ప్రజలు ఆదరించాలని కోరారు. సరసమైన ధరల్లో, నాణ్యమైన వస్త్రాలు అందుబాటులో ఉన్నాయని, సంక్రాంతి సందర్భంగా అందిస్తున్న ఆఫర్లను విశాఖ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్‌ఎస్ బ్రదర్స్ రీటైల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లు పి.వెంకటేశ్వర్లు, ఎస్.రాజమౌళి, టి.ప్రసాదరావు మాట్లాడుతూ జగదాంబ దరి షోరూమ్‌లో రూ.150 కనిష్ట ధరతో వస్త్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నగరంలో మరిన్ని షోరూమ్‌లు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రారంభోత్సవం సందర్భంగా వన్ ప్లస్ వన్ ఆఫర్, 50 శాతం వరకు తగ్గింపు అందజేస్తున్నట్లు తెలిపారు. అన్ని రకాల సిల్క్ చీరలు, గార్మెంట్స్‌పై కాస్ట్ టు కాస్ట్ విక్రయాలు ఉంటాయని ప్రకటించారు.

నేడు జిల్లా వైజ్ఞానిక ప్రదర్శన

ఆరిలోవ: తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరగనున్న జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన(సైన్స్ ఫేర్)కు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు డీఈవో ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా గురువారం తోటగరువు హైస్కూల్‌ను ఆయన సందర్శించారు. ఇక్కడ ప్రదర్శనకు చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నిర్వహణ కమిటీ సభ్యులతో సమావేశమై, పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రదర్శనకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రతి మండలం నుంచి మండల స్థాయి పోటీల్లో ఉత్తమమైన 3 ప్రాజెక్టులను ఎంపిక చేసినట్లు తెలిపారు. 11 మండలాల నుంచి ఎంపికైన 33 ప్రాజెక్టులతో ప్రదర్శనను శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ప్రదర్శనలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామన్నారు. వివిధ మండలాల నుంచి రానున్న విద్యార్థులు, ఉపాధ్యాయులకు భోజనం, మంచినీటి వసతి, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఏపీసీ చంద్రశేఖర్, ఏడీ అరుణ్ జ్యోతి, డీసీఈ బోర్డు కార్యదర్శి ఎంవీ కృష్ణకుమార్, పలువురు హెచ్‌ఎంలు, ఎంఈవోలు పాల్గొన్నారు.

తీరమంతా కళేబరాలే..



తాబేళ్ల కళేబరాలను తరలిస్తున్న పారిశుధ్య సిబ్బంది


కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డునానుకుని తీరం పొడవునా తాబేళ్ల కళేబరాలే దర్శనమిస్తున్నాయి. పెదనాగమయపాలెం, భీమిలి, ఉప్పాడ, మంగమారిపేట, తొట్లకొండ బీచ్, రుషికొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, జోడుగుళ్లపాలెం తీరప్రాంతాల్లో ఎక్కడ చూసినా భారీ తాబేళ్ల కళేబరాలు పదుల సంఖ్యలో కొట్టుకు వచ్చాయి. దీంతో ఇక్కడకు వచ్చిన పర్యాటకులు ఆందోళనతో పాటు, అసహనానికి గురవుతున్నారు. తీరం మొత్తం దుర్వాసన వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జోన్–1, జోన్–2 పారిశుధ్య సిబ్బంది గురువారం కళేబరాలను తొలగించారు. వ్యాన్‌లు ఏర్పాటు చేసి, ఈ కళేబరాలను తరలించి, ఆయా ప్రాంతాలను శుభ్రం చేశారు.

అంధత్వ నియంత్రణకు శంకర్ ఫౌండేషన్ కృషి

- గత ఏడాదిలో 33,175 మందికి కంటి శస్త్ర చికిత్సలు
- 1,96,148 మందికి ఓపీ వైద్య సేవలు
- ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు

సింహాచలం: గతేడాది(2024)లో జనవరి నుంచి డిసెంబర్ వరకు స్థానిక శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో 33,175 మందికి కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి డీజీఎం కె.బంగార్రాజు(పీఆర్) గురువారం తెలిపారు. వీటిల్లో 68 శాతం మందికి డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ/ డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా కంటి పరీక్షలు జరిపి, శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. లక్షా 96 వేల 148 మంది ఔట్ పేషెంట్లకు కంటి వైద్యం అందించి అంధత్వ నివారణకు కృషి చేసినట్లు వెల్లడించారు. దీంతోపాటు హాస్పిటల్ ఔట్‌రీచ్ టీం ఉత్తరాంధ్ర జిల్లాల్లో 505 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి, 34,305 మందికి కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. వీరిలో 12,903 మందిని ఆస్పత్రికి తీసుకొచ్చి ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహించి, వారికి ఉచిత రవాణా కల్పించి, స్వగ్రామాలకు చేర్చామన్నారు. శ్రీకాకుళం, మద్దిలపాలెం, మధురవాడ, గాజువాకలో ఉన్న శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రుల్లో కూడా 2024లో అద్భుత పనితీరు కనబరిచామన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఆస్పత్రి వైద్యులకు, సిబ్బందికి మేనేజింగ్ ట్రస్టీ ఆత్మకూరి కృష్ణకుమార్, జనరల్ మేనేజర్ కె.రాధాకృష్ణన్ అభినందనలు తెలిపారు.

235 కిలోల గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయి, నిందితులు

పెందుర్తి: చినముషిడివాడలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 235 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌కు చెందిన బినయ్ కుమార్ మిశ్రా, ఉత్తరప్రదేశ్‌కు చెందిన యోగేంద్ర చౌదరి, ఒడిశాకు చెందిన షేక్ జిలానీ బృందంగా ఏర్పడి చినముషిడివాడ సమీపంలోని వుడాకాలనీలో ఓ అపార్ట్‌మెంట్ సెల్లార్‌ను అద్దెకు తీసుకున్నారు. ఇటీవల ఏజెన్సీ నుంచి తీసుకువచ్చిన గంజాయిని నిల్వ ఉంచి.. అక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు దాడి చేసి నిందితులను అరెస్ట్ చేసి నిల్వ ఉంచిన గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గల్లంతైన బాలుడి మృతి

సాగర్‌దుర్గా బీచ్‌కు కొట్టుకొచ్చిన మృతదేహం

మల్కాపురం: ఆర్.కె.బీచ్ వద్ద సముద్రంలో గల్లంతైన బాలుడు శవమై తేలాడు. మల్కాపురం పోలీసులు తెలిపిన వివరాలివీ.. నాలుగు రోజుల కిందట మద్దిలపాలేనికి చెందిన వి.నగేష్(13) తన స్నేహితులతో కలిసి ఆర్.కె.బీచ్ వద్ద సముద్రంలో స్నానానికి దిగాడు. ప్రమాదవశాత్తు నగేష్ సముద్రంలో గల్లంతయ్యాడు. అతని కోసం గజ ఈతగాళ్లు, పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. అయితే బాలుడి మృతదేహం షిప్‌యార్డ్ సమీపంలోని సాగర్‌దుర్గా బీచ్‌లో గురువారం ఉదయం తేలుతూ కనిపించింది. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది మృతదేహం చూసి.. మల్కాపురం పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చి.. వివరాలు సేకరించారు. సోమవారం మధ్యాహ్నం బాలుడు గల్లంతయ్యాడని, గజ ఈతగాళ్లు తీవ్రంగా గాలించినా ఫలితం లేకపోయిందని పోలీసులు తెలిపారు.